
రాఘవేంద్రా.. కష్టాలు కనవా..!



- తుంగభద్ర నుంచి 333 టీఎంసీలు దిగువకు వదిలేశారు
- గురురాఘవేంద్ర లిఫ్టులు ఉన్నా ఎత్తిపోయలేని దైన్యం
- విద్యుత్ పంపులు, కాపర్ వైరు దోచుకెళ్లిన దుండగులు
- నిరుపయోగంగా నాలుగు ఎత్తిపోతల పథకాలు
- నిర్వహణ, మరమ్మతులకు రూ.17.05 కోట్ల ప్రతిపాదనలు
- నిధులు ఇవ్వని ప్రభుత్వం



మాధవరం స్టేజ్-1 పంప్‌హౌస్

తుంగభద్రకు వరద పోటెత్తింది. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు ద్వారా వరద నీటిని ఎత్తిపోసి నిల్వ చేసి ఉంటారు..? మెట్ట పొలాలకు సాగునీటికి కష్టాలు ఉండవు..? పల్లెసీమలు పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయి..! అనుకుంటే మాత్రం పొరపాటే. కళ్ల ఎదుటే తుంగభద్ర పరవళ్లు తొక్కినా ఎత్తిపోసుకోలేని దైన్యపరిస్థితి ఉంది. కారణం.. వివిధ ఎత్తిపోతల పథకాల పంపులు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానల్ బోర్డులు ధ్వంసం చేసి కాపర్‌వైరు, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. వాటికి ఇంతవరకూ మరమ్మతులు చేయలేదు. ఏడేళ్లుగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) కోసం నిధులు ఇవ్వడం లేదు. మరమ్మతులు, నిర్వహణకు రూ.17 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపితే వివిధ కొర్రీలు పెట్టి రెండుసార్లు వెనక్కి పంపించారు. ఈ ఏడాది సుంకేసుల బ్యారేజీ నుంచి 333 టీఎంసీలు తుంగభద్ర వరద దిగువకు వదిలేశారు. గత వైసీపీ ప్రభుత్వం తరహాలోనే కూటమి ప్రభుత్వం కూడా గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలపై నిర్లక్ష్యం కరువు రైతులను కన్నీటిపాలు చేస్తుంది. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల దుస్థితిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కర్నూలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో వివిధ గ్రామాలకు తుంగభద్ర జలాలు ఎత్తిపోసి ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఆయా నియోజకవర్గాల్లో 66,815 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం. పులికనుమ, పులకుర్తి ఎత్తిపోతల పథకాలు 15 ఏళ్ల కాంట్రాక్ట్ సంస్థ నిర్వహణలో ఉన్నాయి. మూగలదొడ్డి, బలసదొడ్డి, పులచింత, మాధవరం, చిలకలడోణ, సోగనూరు, దుద్ది లిఫ్టులు జలవనరుల శాఖ, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, కంబదహాల్, చింతమానుపల్లె ఎత్తిపోతల పథకాలు ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) పర్యవేక్షణలో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వీటి నిర్వహణకు ఒక్క పైసా ఇవ్వలేదు. ఆపరేటర్లు, కాపల సిబ్బంది (వాచ్ అండ్ వార్డు) కూడా లేరు. దోపిడీ దొంగలు పలు లిఫ్టుల పంప్‌హౌస్‌లో పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైరు, ఆయిల్ దోచుకెళ్లారు.

● నిధులు ఇవ్వలేక కొర్రీలు

కూటమి ప్రభుత్వం రావడంతో గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల నిర్వహణ కష్టాలు తీరుతాయని రైతులు ఆశించారు. 15 నెలలు గడిచినా ఆ దిశగా చర్యలు శూన్యం. శాశ్వత మరమ్మతులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) కోసం రూ.17.05 కోట్లు ఇవ్వాలని 2024 నవంబరు 1న రాష్ట్ర జలవనరుల శాఖకు ప్రతిపాదనలు పంపించారు. మరమ్మతులు, ఓ అండ్ ఎం ప్రతిపాదనలు వేరువేరుగా పంపించాలని కొర్రీ పెట్టి వెనక్కి పంపించారు. రాష్ట్ర అధికారుల సూచన మేరకు 2024-25 ఎస్ఎస్ఆర్ రేట్లతో ఈ ఏడాది ఏప్రిల్‌లో మరోసారి ప్రతిపాదనలు పంపారు. తాజాగా జూలై నుంచి అమలులోకి వచ్చిన 2025-26 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం ప్రతిపాదనలు పంపాలని కొర్రీ పెట్టి మళ్లీ వెనక్కి పంపించారు. నిధులు ఇవ్వకుండా కావాలనే కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూతన ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం మూడో పర్యాయం ప్రతిపాదనలు పంపించేందుకు ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు. అప్పుడైనా నిధులు ఇస్తారా..? మరో కొర్రీ పెట్టి వెనక్కి నెట్టేస్తారా..? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

మిగతా 6లో...



బసలదొడ్డి లిఫ్ట్ పంప్‌హౌస్

ఆదోని తహసీల్దార్‌పై వేటు

- కలెక్టర్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు



తహసీల్దార్ రమేష్

ఆదోని రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం, అనుమతి లేకుండా సెలవుపై వెళ్లిన ఆదోని తహసీల్దార్ రమేష్‌పై సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వేటు వేశారు. గత నెలలో అధిక వర్షాల వల్ల ఆదోని అతలాకుతలమైంది. దీంతో రెవెన్యూ సిబ్బంది ఎవరూ సెలవుపై వెళ్లకుండా వరద బాధితులకు సహకారం అందించాలని సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే గత నెల 27వ తేదీన గృహ ప్రవేశం ఉన్నందున ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే తహసీల్దార్ రమేష్ సెలవుపై వెళ్లారు. ఆ సమయంలో ఆదోనిలో అధిక వర్షాలతో రాంజలా చెరువు నిండి పొంగిపొర్లడంతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రూరల్ ప్రాంతాల్లో కూడా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ నేపథ్యంలో గత నెల 28వ తేదీన నిర్వహించిన సబ్ కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్‌కు రమేష్ హాజరు కాలేదు. దీంతో ఆయనపై ఆరా తీసి చర్యలకు ఉపక్రమించారు. తక్షణమే రమేష్‌ను కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు ఆదోని ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ బాబుకు అప్పగిస్తూ ఆర్డర్స్ ఇచ్చారు.

చర్యలు వద్దని పట్టుబట్టిన ఎమ్మెల్యే

ఆదోని తహసీల్దార్‌గా రమేష్‌నే ఉంచాలని, అతనిపై చర్యలు తీసుకోవద్దని ఎమ్మెల్యే పార్థసారథి పట్టుబట్టారు. ఈ మేరకు అధికారులపై ఒత్తిడి తేవడంతో పాటు నేరుగా కలెక్టర్ డాక్టర్ సిరిని కలిసి రమేష్‌పై చర్యలు తీసుకోవద్దని విన్నవించినట్లు విశ్వసనీయ సమాచారం.

వరదల సమయంలో విధుల్లో లేరు : సబ్ కలెక్టర్

ఆదోని తహసీల్దార్ రమేష్ గత నెలలో వరదల సమయంలో అనుమతులు లేకుండా సెలవుపై వెళ్లడంతోనే కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేశానని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. ఈ విషయం కలెక్టర్ పరిధిలో ఉందన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా, అనుమతులు లేకుండా సెలవుపై వెళ్లినా చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా చూసుకోవాలని కలెక్టర్ మందలించడంతో పాటు నేటి నుంచి విధులకు వెళ్లాలని ఆదేశించారని పేర్కొన్నారు.

శానిటేషన్ ఏజెన్సీ గందరగోళం

● విద్యార్హత పేరుతో ఉద్యోగుల తొలగింపు



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఏజెన్సీ మేనేజర్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పారిశుధ్య విభాగంలో విద్యార్హత పేరుతో కొందరు శానిటేషన్ కార్మికులు, సూపర్‌వైజర్ల తొలగింపు అంశం వివాదంగా మారింది. కర్నూలు జీజీహెచ్, ఐ-హాస్పిటల్, కర్నూలు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, హాస్టల్స్‌లో పారిశుధ్య పనులను ప్రభుత్వం ఇటీవల తిరుపతికి చెందిన పద్మావతి పెర్టిలిటీ సంస్థకు అప్పగించింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఏజెన్సీ పారిశుధ్య బాధ్యతలను చేపట్టింది. పారిశుధ్య కార్మికులకు విద్యార్హత 8వ తరగతి, 50 సంవత్సరాలు దాటిన వారిని తొలగించాలని, సూపర్‌వైజర్లకు డిగ్రీ విద్యార్హతగా ప్రభుత్వం కొత్తగా జీవోను అమలు చేసింది. కర్నూలు జీజీహెచ్‌లో 330 మంది పారిశుధ్య కార్మికులు 44 మంది సూపర్‌వైజర్లు కావాల్సి ఉంది. అయితే విద్యార్హత పేరుతో గత పదేళ్లుగా ఐ-హాస్పిటల్‌లో పని చేస్తున్న ఓ మహిళ సూపర్‌వైజర్‌తో పాటు కర్నూలు జీజీహెచ్‌ఓ మరో సూపర్‌వైజర్‌ను, కొత్త ఏజెన్సీ తొలగించడం వివాదాస్పదంగా మారింది. వాస్తవానికి కర్నూలు జీజీహెచ్‌లో 330 మందికి గానూ 290 మంది కార్మికులు, సూపర్‌వైజర్లు 44 మందికి గానూ 40 మంది పని చేస్తున్నారు. విద్యార్హతల పేరుతో 50 సంవత్సరాల వయస్సు దాటిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తుండటంతో పారిశుధ్య కార్మికుల్లో అలజడి నెలకొంది. గత పదేళ్లుగా పని చేస్తున్న తమను విద్యార్హత, వయస్సు కారణాలతో ఎలా తొలగిస్తారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కొత్తగా విధుల్లో చేరిన కార్మికులకు మాత్రమే ఇలాంటి నిబంధనలు వర్తిస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై ఏజెన్సీ మేనేజర్ సూరిబాబు మాట్లాడుతూ జీవో ప్రకారమే తాము వ్యవహరిస్తున్నామన్నారు. విద్యార్హతలు లేకుంటే ఆ ఉద్యోగి కుటుంబంలో ఎవరికైనా ఉద్యోగం ఇస్తామన్నారు.

బీసీలకు భరోసా

- ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ప్రయోజనాలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి
- వాల్మీకి భవన్‌కు రూ.కోటి విరాళం
- మంత్రి టీజీ భరత్ హామీ
- ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు





వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు భరోసానిచ్చేలా ప్రభుత్వ పాలన సాగుతోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఆర్.సవిత వెల్లడించారు. విద్యార్థుల కోసం రాష్ట్రంలో మరిన్ని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన తరగతుల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. మంగళవారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వాల్మీకి మహర్షి జయంతి రాష్ట్రస్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవితతో పాటు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ సిరి, కర్నూలు, అనంతపురం ఎంపీలు బస్తిపాటి నాగరాజు, అంబిక లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా చిత్రపటానికి మంత్రులు సవిత, టీజీ భరత్ వాల్మీకి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ వాల్మీకి రామాయణం సమాజానికి సన్మార్గాన్ని చూపుతుందన్నారు.

మిగతా 7లో...



హాజరైన వాల్మీకులు

దళారుల మాయాజాలం

● టమోటా రైతుకు శాపం

● పత్తికొండలో రూ.4, ఆదోనిలో రూ.20 ధర పలికిన వైనం



పత్తికొండలో టమోటాలను రోడ్డుపై పారబోస్తున్న రైతులు

ఆరుగాలం కష్టించి, వ్యవప్రయాసలకోర్చి, చమటోడ్చి పంటలు పండించిన అన్నదాత ఆశలు ఆవిరవుతున్నాయి. ఏటా నష్టాలు చవి చూస్తున్నా ఆశ చావక మళ్లీ అప్పులు చేసి పైరు పెట్టి అతి కష్టమ్మీద పండించినా ఫలితం లేకుండా పోతోంది. మధ్య దళారులు చేతివాటంతో టమోటా ధర పత్తికొండలో రూ.4, ఆదోనిలో రూ.20 పలుకుతోంది. ధర గిట్టుబాటు కాని రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఆదోని, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని పత్తికొండ మార్కెట్‌లో టమాటా కిలో రూ.4కు కూడా అమ్ముడుపోక రైతులు పంటను రోడ్డుపై పారబోసి కన్నీతో వెనుదిరిగారు. అయితే ఆదోని రైతు బజార్‌లో మాత్రం వినియోగదారులు అదే టమాటాను కిలో రూ.20 కొనుగోలు చేస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోంది.

టమాటా సాగుకు ఎకరాకు అయ్యే పెట్టుబడి, తెగుళ్ల నియంత్రణకు వాడే మందులు, కలుపు తీత, కోత కూలి ఖర్చులు, మార్కెట్‌కు రవాణా చార్జీలు... అన్నీ పోనూ రైతుకు మిగిలేది అంతంతమాత్రమే.. పత్తికొండ మార్కెట్‌లో వ్యాపారులు నాణ్యత పేరు చెప్పి రైతుల నుంచి కిలో టమాటాను కేవలం రూ.1 నుంచి రూ.4 మధ్య కొనుగోలు చేశారు. పది కిలోల గంప ధర రూ.40 నుంచి రూ.60 మాత్రమే పలికింది. కనీసం రైతుకు ఆటోలో తీసుకొచ్చిన బాడుగ కూడా చేతికి రాలేదు. కూలీకి రోజుకు ఇచ్చే రూ.300 కూడా దక్కలేదు. దీంతో పంటను రోడ్డుపై పారబోసి ఎంతో ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నిజంగా ప్రజలకు టమాటా చౌకగా దొరుకుతుంటే, రైతు నష్టపోయినా కాస్త ఉపశమనం ఉండేది. కానీ పత్తికొండలో రైతు రూ.4కు అమ్ముకోలేక పారబోస్తే ఆదోని వంటి పట్టణాల్లో ప్రజలు రూ.20 చెల్లించాల్సి వస్తోంది. ఈ భారీ వ్యత్యాసం మొత్తం మధ్య దళారుల జేబుల్లోకి వెళ్లిపోతోందనేది జగమెరిగిన సత్యం. రైతు నుంచి కొద్ది ధరకు కొని, రవాణా, నిల్వ పేరుతో భారీ మార్జిన్లను జోడించి, వినియోగదారుడిపై భారం మోపుతున్న ఈ దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతోంది. ప్రభుత్వం తక్షణమే మేల్కొని గిట్టుబాటు ధరకు శాశ్వత చర్యలు చేపట్టాలి. రైతు బజార్లను బలోపేతం చేసి ప్రభుత్వం తరపున సబ్సిడీతో కూడిన ప్రత్యేక రవాణా వాహనాలను రైతు సంఘాలకు అందించాలి. మధ్యవర్తిత్వాన్ని తగ్గించాలి.



RYTHU BAZAR - ADONI
Old Bus-stand, ADONI- 518 301, Kurnool Dist. (A.P)
DAILY REPORT ON THE RATE OF VEGITABLES IN ADONI RYTHU BAZAR AS ON

ఆదోని రైతు బజార్‌లో కిలో టమోటా రూ.20కు విక్రయిస్తున్న దృశ్యం

ఆదోని మార్కెట్‌లో ధర ఎక్కువగా పలికింది

ఆదోని మార్కెట్‌లో టమోటా ధర ఎక్కువగానే పలికింది. దాని ప్రకారంగానే రైతు బజార్‌లో కూడా ధర రావాల్సి ఉంటుంది. పత్తికొండ నుంచి టమోటాలను పంపిస్తామన్నారు. పంకపోవడంతో లోకల్ ధరను బట్టి 10 కేజీలు రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలి కింది. దాని ప్రకారంగానే కేజీ రూ.20 ధర నిర్ణయించి బోర్డుపై రాయాల్సి వచ్చింది.

- హరీష్, ఎస్టేట్ అధికారి, రైతు బజార్, ఆదోని

మాంసం.. ఆరోగ్యంతో చెలగాటం 6

ప్రధాని మోదీ పర్యటనకు భారీ ఏర్పాట్లు 7



అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

డీజీపీ పర్యటన రద్దు 7

ప్రధాని పర్యటనపై సమీక్ష



ఆలయం ముందు భాగంలో ఏర్పాట్లను తెలుసుకుంటున్న వీరపాండియన్

- శ్రీశైలంలో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు
- క్షేత్రస్థాయిలో భద్రతపై పరిశీలన
- పరిపాలనా భవనంలో ఏర్పాట్లపై సమీక్ష



అతిథి గృహంలో ఏర్పాట్లపై సమావేశమైన పోలీసు ఉన్నతాధికారులు



కేంద్రం వద్ద పోలీసుల పరిశీలన

శ్రీశైలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన శ్రీశైలం పర్యటనకు రానున్న నేపథ్యంలో మంగళవారం ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని సీనియర్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు శ్రీశైలానికి చేరుకున్నారు. ప్రధాన మంత్రి ప్రోగ్రాం స్పెషల్ అధికారి వీరపాండియన్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, గ్రేహౌండ్స్ డీఐజీ బాబూజీ, ప్రకాశం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సీఐడీ ఎస్పీ ఎస్వీ శ్రీధర్ రావు, నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్, ఐపీఎస్ అధికారి అధిరాజ్‌సిగ్ రాణా, శ్రీశైలం ఆలయ ఈఓ శ్రీనివాసరావు తదితరులు పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముందుగా వారు సున్నిపెంట హెలిప్యాడ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం శ్రీశైలానికి చేరుకుని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి మల్లికార్జునస్వామి ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్దకు చేరుకుని ప్రధాని పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లపై కూడా ఆరా తీశారు. ప్రధానమంత్రి సున్నిపెంట హెలీప్యాడ్ వద్ద ల్యాండ్ అయి అక్కడి నుంచి శ్రీశైలానికి రోడ్డుమార్గాన వస్తారు. దీంతో రహదారి వెంబడి భద్రతా ఏర్పాట్లు, రహదారిని పరిశీలించారు. రహదారికి మరమ్మతులు వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత శ్రీశైలం దేవస్థానం పరిపాలన భవనంలో ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు, ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో నంద్యాల ఏఎస్పీ యుగంధర్ బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐ ప్రసాదరావు, నంద్యాల జిల్లా సీఐలు పాల్గొన్నారు.

వరద కడలిపాలు..
రైతులు కన్నీటిపాలు..!

(5వ పేజీ తరువాయి)



గతేడాది గురురాఘవేంద్ర ప్రాజెక్టు మాధవరం స్టేజ్-2 ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లో దుండగులు ధ్వంసం చేసిన ప్యానల్ బోర్డులు (ఫైల్)

మూగలదొడ్డి, మాధవరం స్టేజ్-1, స్టేజ్-2, బసలదొడ్డి స్టేజ్-1, చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2, సోగనూరు స్టేజ్-1, పులచింత స్టేజ్-1, స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పంప్ హౌస్ దగ్గర 1000 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు. మాధవరం స్టేజ్-1 లిఫ్ట్‌లో హెచ్‌టీ, ఎల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, బలసదొడ్డి స్టేజ్-1 పంప్ హౌస్‌లో ప్యానల్ బోర్డులు ధ్వంసం చేసి విలువైన కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కడపకు చెందిన ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సంస్థ ఎండీ శివశంకర్‌రెడ్డి ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు పరిశీలించి వాటిని మరమ్మతులు చేయడం సాధ్యపడదని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని నివేదిక ఇచ్చారు. పలు ఎత్తిపోతల పథకాలు సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్లతో తాత్కాలికంగా రన్ చేసే అవకాశం ఉన్నా, మాధవరం స్టేజ్-1, 2, బసలదొడ్డి స్టేజ్-2, చికలడోన స్టేజ్-1, స్టేజ్-2, పులచింత స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పూర్తిగా పడకేశాయి. వాటి శాశ్వత మరమ్మతులు ఎప్పుడు చేస్తారు..? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

● వివిధ ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు, నిర్వహణ ప్రతిపాదనలు (రూ.కోట్లల్లో):

ఎత్తిపోతల పథకం	అంచనా (రూ.కోట్లలో)
మూగలదొడ్డి	1.53
బసలదొడ్డి	2.66
పులచింత	3.93
మాధవరం	2.14
చిలకలడోణ	2.25
సోగనూరు	3.64
దుద్ది	0.89
మొత్తం	17.05

● ప్రతిపాదనలు పంపుతున్నాం

గురురామవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు, నిర్వహణ కోసం ప్రభుత్వానికి రూ.17 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. 2025-26 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం మళ్లీ ప్రతిపాదనలు పంపాలని సూచనలతో ఫైలు వెనక్కి పంపించారు. పంపులు తాజాగా రేట్లకు కొటేషన్ తీసుకొని ప్రభుత్వం సూచనల మేరకు నూతన ఎస్ఎస్ఆర్ రేట్లకు ప్రతిపాదనలు తయారు చేసి త్వరలోనే ప్రభుత్వానికి పంపుతాం. నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం.
- బాలచంద్రారెడ్డి, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ, కర్నూలు

మట్టిలో మాణిక్యం వంశీకృష్ణారెడ్డి
- తెలంగాణా గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటిన పెద్దకడబూరు వాసి



వంశీకృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న తల్లిదండ్రులు

పెద్దకడబూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కుటుంబంలో పుట్టి రైతులకు, పేదలకు సేవలందించాలనే ఉక్కు సంకల్పంతో కఠోర దీక్షతో చదివి లక్ష్యాన్ని ఛేదించి శభాష్ అనిపించుకున్నాడా విద్యార్థి. తెలంగాణా గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటి మూడవ ర్యాంకు సాధించాడు. ఆ వివరాలు ఇవీ... మండల కేంద్రమైన పెద్దకడబూరుకు చెందిన స్వాతంత్ర సమరయోధుడు కీ.శే వెంకటరెడ్డిముని మనవడు వంశీకృష్ణారెడ్డి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ గ్రూప్-1 పరీక్షల్లో మూడవ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డిని వారి కుటుంబ సభ్యులు, మండల ప్రజలు అభినందించారు. వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తమ తాత వెంకటరెడ్డిని ఆదర్శంగా తీసుకొని తాను ప్రజలకు, రైతులకు సేవ చేయాలన్న సంకల్పంతో గ్రూప్-1 ఉద్యోగాన్ని సాధించానన్నారు. ఐఏఎస్‌కు ఎంపికై దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నదే తన ఆకాంక్ష అన్నారు.

మెరుగైన పాలనకు వార్డుల విభజన ఉండాలి

● మెజార్టీ కౌన్సిలర్లు సూచన
● కౌన్సిల్ సభలో వార్డుల పునర్విభజనపై రచ్చ
● మున్సిపల్ వార్డుల పెంపు తీర్మానం వాయిదా




వార్డుల పునర్విభజన కౌన్సిల్‌లో జరుగుతున్న చర్చ

ఆత్మకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా మెరుగైన పరిపాలన అందించే విధంగానే వార్డుల విభజన ఉండాలని మెజార్టీ కౌన్సిలర్లు సూచించారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పట్టణంలో ఉన్న 24వార్డులను 28వార్డులుగా పునర్విభజన చేసే అంశాన్ని ప్రస్తావించగా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరిని సంప్రదించి వార్డుల విభజన చేశారని, అడ్డగోలుగా వార్డుల విభజన ఉందంటూ వైసీపీకి చెందిన కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒకే కాలనీలో పక్కపక్కన, ఎదురెదురు నివాసం ఉంటే ఇళ్లను సైతం వేర్వేరు వార్డుల్లో ఉంచారని, కొన్ని చోట్ల ఒకే ఇంట్లో ఓటర్లను వేర్వేరు జాబితాలో మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటిని పరిష్కరించకుండా వార్డుల పునర్విభజన ఏవిధంగా చేస్తారని సభ్యులు నిలదీశారు. రాజకీయాలకు అతీతంగా మెరుగైన పరిపాలన అందించే విధంగానే వార్డుల విభజన ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. 2011 డిసెంబరు 28న ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ నగర పంచాయతీగా రూపాంతరం చెందిందన్నారు. ఆ తర్వాత 2019 జూలై 24న గ్రేడ్-3 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చెందిందని అన్నారు. జనాభా పెరుగుదల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న 24వార్డులను 28వార్డులుగా మార్చాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. పేపర్ ప్రకటన ద్వారా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరినప్పటికీ ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు. రెండు కౌన్సిల్ సభల్లో ఈ తీర్మానం ఆమోదం పొందకపోతే ఆతర్వాత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా మాట్లాడుతూ మరొకసారి వార్డు పునర్విభజన అంశాన్ని పరిశీలించాలని, అప్పటివరకు తీర్మానాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

ఇతరులను ఏవిధంగా అనుమతించారు?: ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో వార్డు పునర్విభజన అంశంపై చర్చ జరుగుతుండగా టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా సభలోకి వచ్చి వెనుక ఉండే కుర్చీల్లో కూర్చుకున్నారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా కౌన్సిల్ సభలోకి ఇతరులను ఏవిధంగా అనుమతిస్తారంటూ మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్ స్పందిస్తూ.. కౌన్సిల్ సభలను వీక్షించేందుకు పబ్లిక్‌కు అవకాశం ఉంటుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలో సైతం పబ్లిక్ గ్యాలరీ ఉంటుందన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.


మాంసం ఆరోగ్యంతో చెలగాటం



బలవర్ధకమైన ఆహారం కోసం వైద్యులు పలు సార్లు మాంసాహారాన్ని తినమంటారు. కానీ ప్రస్తుతం మాంసం తింటే రోగాల బారిన పడే పరిస్థితులు కర్నూలు నగరంలోని నెలకొన్నాయి. మాంసం వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఇష్టానుసారంగా మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. రోడ్ల మీద జంతువులను వధిస్తున్నారు. అక్కడే అమ్మకాలు జరుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



● రోడ్లపైనే విక్రయాలు
● జోరుగా కల్తీ మాంసం అమ్మకాలు
● నిబంధనలకు తూట్లు
● పట్టించుకోని అధికారులు



రోడ్ల పక్కన రక్షణ చర్యలు లేకుండా మాంసం విక్రయాలు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాంసం వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మాంసం విక్రయాలపై దృష్టిపెట్టాల్సిన మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు వాటిమాటే మరిచిపోయారు. రోడ్లపైనే జంతువులు వధించి మాంసం విక్రయాలు జరుపుతున్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదంటే అతిశయోక్తి కాదు. కల్తీ మాంసం తిని ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా అధికారులు తమకు ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు.

రెండు జంతు వధశాలలున్నా..

నగరంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లపైనే జంతువులు వధించి మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో అధికారికంగా రెండు జంతు వధశాలలున్నాయి. వాటిని టెండర్ల ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్లు వ్యాపారులకు అద్దెలకిచ్చి డబ్బులు వసూలు చేసుకుంటున్నారు. పశువైద్యాధికారి, మున్సిపల్ ఆరోగ్య అధికారి పరిక్షించిన అనంతరమే ఈవధశాలలో పశువులను వధించాలని నిబంధనలున్నాయి. అవేమీ అమలు కావడంలేదు. నగరంలో వందల సంఖ్యలో అనుమతిలేని మాంసం దుకాణాలున్నాయి. షాపుల్లో జంతువులు వధించరాదని నిషేదాజ్ఞలున్నా ఎవరూ పాటించడం లేదు. కబేలా కంటే ఎక్కువ శాతం దుకాణాల వద్దే జంతువులు వధిస్తున్నారు.

మాంసం కల్తీచేసి..

నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్యం పరిరక్షించేందుకు 19 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఒక శానిటరీ సూపర్‌వైజర్ ఉన్నారు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు మామూళ్లకు అలవాటు పడిన కారణంగా కల్తీ మాంసం విక్రయాలు జోరు గా సాగుతున్నాయన్న విమర్శలున్నాయి. పొట్టేలు మాంసం స్థానంలో కొందరు వ్యా పారులు నిషేదిత జంతువుల మాంసం కల్తీచేసి విక్రయిస్తున్నారు. దీనిని తిన్న ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారు.

నిబంధనలు ఇలా:

మాంసం విక్రయించే వ్యాపారి నగరపాలక సంస్థకు ఫీజు చెల్లించి తప్పని సరిగా అనుమతి పొందాలి. కబేలాతో పాటు బయట వధించే ప్రతి జంతువును పశువైద్యాధికారి పరిక్షించాలి. నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండగా రెండు నెలల క్రితం పశువైద్యాధికారిని నియమించారు.

● ఆరు నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న జంతువులు వధించరాదు. అనుమతి పొందిన కబేలాలోనే వధించాలి. నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారులు దగ్గరుండి చెడిపోయిన కల్తీమాంసం తొలగించాలి.

నిబంధనలు పాటించడం లేదు



మాంసం వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. నిషేధిత జంతువులు సైతం రోడ్లపై వధించి వాటి మాంసం విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
● ఎం.శ్రీహర్ష, ప్రగతి సమితి అధ్యక్షుడు, కర్నూలు



ఓర్వకల్లులో జ్యోతులతో చిందులు వేస్తున్న కళాకారులు



పూజలందుకుంటున్న చౌడేశ్వరి అమ్మవారు

నేత్రపర్వం.. జ్యోతుల మహోత్సవం

● వేలాదిగా తరలి వచ్చిన భక్త జనం
● చౌడమ్మ ఉత్సవాల్లో అలరించిన నృత్య ప్రదర్శనలు

ఓర్వకల్లు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : తొగట వీర క్షత్రియ వంశస్థుల ఇలవేల్పు అయిన చౌడేశ్వరి మాత పున్నమి తిరుణాల ఓర్వకల్లులో సోమవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. ఉదయం అమ్మవారికి అర్చకులు శాస్త్రోక్తంగా విశిష్ట పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టు వస్త్రాలతో చౌడేశ్వరి దేవిని ముస్తాబు చేసి, సింహ వాహనంపై అధిష్టించి అశేష భక్త జనం మధ్య ఊరేగించారు. అనంతరం అమ్మవారికి భక్తులు సమర్పించిన 27 జ్యోతుల ఊరేగింపు ఉత్సవాలు సోమవారం రాత్రి 12.00 గంటలకు ప్రారంభమై మంగళవారం తెల్లవారుజామున ముగిశాయి. భక్తులు జ్యోతులను తలపై పెట్టుకొని మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీధులలో భారీ ఊరేగింపు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి జ్యోతుల ఉత్సవాలను తిలకించారు. జ్యోతుల ఊరేగింపులో తొగట వీర క్షత్రియుల సంప్రదాయ నృత్య ప్రదర్శన, నందికోల సేవ, ఖడ్గ శావ, చెక్క భజన, కీలు గుర్రం, గొరవయ్యల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారికి కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ఏపీఆర్ సెట్ నోటిఫికేషన్ విడుదల

● మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
● నవంబరు 3 నుంచి 7 వరకు పరీక్షలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఆర్ సెట్ 2024-25) ద్వారా పీహెచ్‌డీ కోర్సులకు అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ అయింది. ఫుల్ టైం.. పార్ట్ టైమ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు హయ్యర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ప్రవేశానికి ఈ పరీక్షలు నిర్వహిస్తారు. నవంబరు 3 నుంచి 7వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఈనెల 7 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని రాయలసీమ యూనివర్సిటీకి చెందిన రీసెర్చ్ విభాగం ప్రొఫెసర్లు తెలిపారు.

ప్రధాని రాకతో శ్రీశైలానికి మరింత వైభవం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న బీజేపీ నేత మాధవ్, కలెక్టర్ రాజకుమారి, ఎంపీ బైరెడ్డి శబరి, ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ శ్రీశైలం పర్యటనతో శ్రీశైల వైభవం మరింత పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని మాధవ్ పాటు శ్రీశైలం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి, ఈఓ ఎం.శ్రీనివాసరావులు పరిశీలించారు. శివాజీ స్ఫూర్తి కేంద్రంలో ప్రధాని ఎక్కడెక్కడ పర్యటిస్తారు, ఎంత సమయం ఉంటారు వంటి అంశాలపై అధికారులతో కలసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ ప్రధాని మల్లికార్జున స్వామి వారి దర్శనార్థం రావడం గొప్ప విశేషమన్నారు. తొలిసారిగా మోదీ ఇక్కడి జ్యోతిర్లింగం క్షేత్రానికి వస్తున్నారన్నారు. ఆయన రాకతో ఈ ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రధాని వచ్చిన తర్వాత ఇక్కడి ప్రాంతం విశిష్టత, విశేషాలను ఆయనకు తెలియజేస్తామన్నారు. దీంతో శ్రీశైలం ప్రాంత అభివృద్ధికి ప్రధానమంత్రి ద్వారా కృషి చేయిస్తామన్నారు. శ్రీశైలం నుంచి శివాజీ మహారాజ్ ధ్యానం చేసి దేశవ్యాప్తంగా జైత్రయాత్ర సాగించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ2.0 ద్వారా సరళీకృత విధానాన్ని తీసుకొచ్చి ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచిందన్నారు. దేశంలోనే తొలిసారిగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని కర్నూలులో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ఈనెల 16వ తేదీన జరిగే ప్రధాని సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయిన వందలాది వాహనాలు



ఎంత కష్టం ఏమిటీ నిర్లక్ష్యం..?

● గంటల తరబడి స్థంభించిన ట్రాఫిక్ ● నాలుగేళ్లుగా సాగుతున్న రోడ్డు నిర్మాణాలు
● వాహనదారులు, ప్రజలకు తప్పని అవస్థలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగేళ్లగా వాహన దారులకు కష్టాలు తప్పడం లేదు. రోడ్డు నిర్మాణ పనులు ఏళ్లతరబడి పూర్తి కాకపోవడంతో వీరికి తిప్పలు తప్పడం లేదు. కర్నూలు- నందికొట్కూరు ప్రధాన రహదారిపై యల్లమ్మ గుడి వద్ద ప్రతి మంగళ, శుక్రవారాల్లో ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వారం ఇక్కడికి వేలాదిగా భక్తులు వస్తుంటారు. పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డులో వాహనాలు ట్రాఫిక్ జామ్‌తో గంటల తరబడి చిక్కుకు పోవాల్సిన దుస్థితి నెలకొంది. పోలీసులు, దేవదయా శాఖ పట్టించుకోక పోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగేళ్లుగా జాతీయ రహదారి పనుల పేరుతో రోడ్డు నిర్మాణాలు అటకెక్కాయి. గుడి ఎదురుగా ప్రధాన రహదారి సింగిల్ రోడ్డు కావడం.. పైగా రాష్ట్ర రాజధానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతి రోజు వేలాదిగా వాహనల రాకపోకలు జరుగుతున్నాయి. రోడ్డుపై గోతులు, కంకర రాళ్లతో పాటు భక్తుల రద్దీతో నిత్యం తొక్కిసలాటతో గుడి కిటకిటలాడుతుంటుంది. ఈ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాహనాలు ఎక్కడి కక్కడ నిలిచిపోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు దాదారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌లో నరక యాతన అనుభవించారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



బీసీలకు భరోసా

(5వ పేజీ తరువాయి)


జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి భరత్

రామాయణం కేవలం మత గ్రంథం కాదని, కుటుంబ విలువలు, నైతిక విలువలు బోధిస్తూ సమాజ నిర్మాణానికి దిక్సూచిగా పని చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో వాల్మీకులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. వాల్మీకులను ఎస్టీలో చేర్చేలా కృషి చేస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు.

వాల్మీకి భవన్‌కు రూ.కోటి : టీజీ భరత్, మంత్రి

వాల్మీకి భవన్ నిర్మాణానికి రూ. కోటి విరాళంగా ఇస్తానని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హామీనిచ్చారు. వాల్మీకులకు ఎస్టీ హోదాకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రస్తుతం డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నందున ముఖ్యమంత్రి కృషి ఫలించి సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.10వేల కోట్లతో పెట్టుబడులు పెడుతూ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. యువతకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు.

- ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో వాల్మీకులు చదువులో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. కర్నూలు జిల్లాలో వలసలు అధికంగా ఉన్నాయనీ, వారి విద్యాభివృద్ధి కోసం వసతి గృహాలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.
- అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతి వేడుకలు కర్నూలులో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాల్మీకి అంటేనే ఒక నమ్మకం, విశ్వాసం, ధైర్యం చరిత్ర అన్నారు.
- ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ వాల్మీకుల కోరిక ఎస్టీ సాధనకు సీఎం చంద్రబాబు ఆశీర్వాదం వల్ల కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు కృషి చేస్తారన్నారు.
- కలెక్టర్ డాక్టర్ సిరి మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం, భారతీయ సంస్కృతి, సాహిత్యం, ధర్మం, మానవత్వం విలువలతో కూడుకుని ఉంటుందన్నారు. రామయణాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో ధర్మం వైపు నడవాలన్నారు.
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి పరివర్తన చెంది రామాయణాన్ని రచించి ఆదికవిగా పేరుగాంచారన్నారు. కుటుంబ విలువల గురించి వాల్మీకి చెప్పిన మాటలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు.
- ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఎస్టీ హోదా కోసం కృషి చేస్తానన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ వాల్మీకులు చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని, పిల్లలను బాగా చదివించాలన్నారు. ఎటువంటి గొడవలు వెళ్లకుండా బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలన్నారు.

ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, కురువ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప, బొందిల కార్పొరేషన్ చైర్మన్ విక్రమసింగ్, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, వాల్మీకి సంఘం నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటనకు భారీ ఏర్పాట్లు

- 185 ఎకరాల్లో సభా ప్రాంగణం
- స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ పర్యవేక్షణ
- జిల్లా అధికారులకు బాధ్యతలు


సభా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

భద్రతపై ప్రత్యేక దృష్టి

ప్రధాని మోదీ కర్నూలు పర్యటన ప్రారంభం మొదలు తిరిగి వెళ్లేంత వరకు ఎలాంటి భద్రతా సమస్యలు తలెత్తకుండా పక్కా వ్యూహంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్కింగ్, రూట్స్ డైవర్షన్, హెలిపాడ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. సభా ఏర్పాట్లు, కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి వచ్చే ప్రజలు సభా ప్రాంగణానికి ఎలా చేరుకోవలో రూట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఏఎస్పీ హుసేన్‌పీరా, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, డీఎస్పీలు, సీఐలతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. అదే క్రమంలో భారీ ఎత్తున జనసమీకరణ చేసి ప్రధాని మోదీ సభను దిగ్విజయం చేయాలని కూటమి పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

కర్నూలు/ కర్నూలు క్రైం/ ఓర్వకల్లు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్‌కు మూడోసారి రానున్నారు. కర్నూలు నుంచే ఈ నెల 16 జీఎస్టీ-2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శంఖారావం పూరిస్తుండడంతో అందరి దృష్టి కర్నూలుపై పడింది. కూటమి ప్రభుత్వం ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారీ సక్సెస్ చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డిలు ఇప్పటికే కర్నూలులో పర్యటించారు. నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలో 185 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాగమయూరి వెంచర్‌ను ప్రధాని మోదీ సభకు ఎంపిక చేశారు. మంగళవారం కర్నూలుకు చేరుకున్న పీఎం ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, సభా ప్రాంగణానికి రూట్‌మ్యాప్ తదితర అంశాలపై అధికారులు కరసత్తు చేస్తున్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి వివిధ శాఖ ముఖ్య కార్యదర్శులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రధాని సభకు మిగిలిన సమయం తొమ్మిది రోజులే. 14వ తేది సాయంత్రంలోగా ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేయాల్సి ఉంది. ఆ తరువాత కేంద్ర నిఘా, భద్రతా అధికారుల నిర్వహణలోకి సభా ప్రాంగణం వెళ్లే అవకాశం ఉంది. అంటే.. మిగిలిన సమయం కేవలం ఆరు రోజులే.

జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు

సభా ఏర్పాట్లపై రూట్ మ్యాప్ తయారు చేశారు. వేదిక నిర్మాణం, పార్కింగ్, జన సమీకరణ, బస్సులు సమకూర్చడం, భోజనాలు, నీరు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ఏఏ రూట్లలో ఏ ప్రాంతానికి చెందిన వాహనాలు అనుమతించాలి.. వివిధ విభాగాలుగా పనులు విభజించారు.


బందోబస్తు ఏర్పాట్లలో ఎస్పీ విక్రాంత పాటిల్

డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్, జడ్పీ, పంచాయతీ రాజ్. రోడ్లు భవనాలు శాఖ, విద్యుత్, సోషల్ వెల్ఫేర్... ఇలా వివిధ విభాగాల పీడీలు, సీఈవోలు, ఎస్ఈలకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో వివిధ మండలాల్లో పని చేసే యంత్రాంగాన్ని రంగంలోకి దింపారు. వారితో స్పెషల్ అధికారి వీర పాండియన్, జిల్లా కలెక్టరు ఎ.సిరిలు వారితో సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీఆర్‌డీఏ రమణారెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు మండల స్థాయి అధికారులతో సమావేశమైన సభా ఏర్పాట్లను విభజించి బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి జిల్లాల నుంచి భారీ ఎక్స్‌కవేటర్లను తెప్పించి సభా ప్రాంగణం చదును చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ కోసం 11 ప్రదేశాలు గుర్తించారు. వివిధ శాఖ అధికారుల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా వీవీఐపీలు, వీఐపీలకు, సభా వేదిక ఏర్పాట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు అప్పగించారు. సేఫ్ రూమ్స్, స్పెషలిస్ట్ వైద్యులు, మెడికల్ టీమ్స్, అంబులెన్స్.. వంటి ఏర్పాట్లను ప్రభుత్వ జర్వజన వైద్యశాల సూపరింటెండెంట్, డీఎంహెచ్‌ఓలకు అప్పగించారు. వివిధ ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు.


సభా ప్రాంగణం వద్ద పనులు చేస్తున్న దృశ్యం

పోక్సో కేసులో ఇంటర్ విద్యార్థి అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ పోక్సో కేసులో ఇంటర్ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పార్థసారధి తెలిపిన మేరకు.. ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసంచేసి గర్భవతిని చేశాడు. ఆలస్యంగా గుర్తించిన తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించి గర్భవతి అని, శిశువు మృతి చెందినట్లు తెలిసింది. దీంతో బాలికను నిలదీయగా.. అసలు విషయం తెలిసింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి జువైనల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

డీజీపీ పర్యటన రద్దు

- నేడు అడిషనల్ డీజీపీ రాక

కర్నూలు క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు డీజీపీ హరీష్ కుమార్ మంగళవారం రాత్రి కర్నూలు చేరుకోవాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల డీజీపీ పర్యటన రద్దయినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించేందుకు లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మాధవరెడ్డి నేడు కర్నూలుకు రానున్నట్లు సమాచారం. రాగమయూరి వద్ద ఉన్న సభా స్థలాన్ని, ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని అడిషినల్ డీజీపీ పరిశీలించనున్నారు.

యూట్యూబర్లపై సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు

అవుకు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నిత్యం విధులకు ఆటంకం కలిగిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్న యూట్యూబర్లపై అవుకు సబ్ రిజిస్ట్రార్ నీలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లతో వీడియోలు తీస్తూ, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురు యూట్యూబర్లపై ఆమె ఎస్ఐ రాజారెడ్డికి మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కొంతమంది యూట్యూబర్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి విధుల్లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

బస్సు బోల్తా - తప్పిన ప్రమాదం

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రకోట సమీపంలో ఓ ప్రైవేటు బస్సు మంగళవారం తెల్లవారు జామున బోల్తాపడింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తూ ప్రమాదం తప్పింది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోనికి చెందిన శ్రీనివాస ట్రావెల్స్ బస్సు హైదరాబాదు నుంచి ఆదోనికి బయలుదేరింది. ఎర్రకోట సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న దున్నపోతును తప్పించబోయి బోల్తాపడింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బోల్తా పడిన ప్రైవేటు బస్సు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నందవరం మండలం జగ్గాపురానికి చెందిన ఇంటర్ విద్యార్థి వెంకటేష్, ఆదోని గోబి సెంటర్‌లో పనిచేస్తున్న మదన్‌సింగ్‌లు స్నేహితులు. ఎమ్మిగనూరు పట్టణం నుంచి బోలేరో వాహనం ఆదోని వైపు వెళ్తు ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న సర్వీసింగ్ సెంటర్‌లోకి వెళ్లేందుకు తిరుగుతుండగా అదే సమయంలో ఆదోని వైపు నుంచి వస్తున్న వెంకటేష్, మదన్‌సింగ్‌ల మోటారు సైకిల్ ఢీకొనడంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపక్కన పడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వటంతో హుటాహుటిన ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడటంతో వీరిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం!

- గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు


బాలికలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమైన కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఎస్పీ సునీల్ షెరాన్ ఆత్మకూరు అర్బన్ సీఐ రామును అభినందించారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన ఓ బాలిక పాములపాడులో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఫోన్ మాట్లాడొద్దని తల్లి మందలించడంతో మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయింది. తన కుమార్తెతో పాటు మేనకోడలు కనిపించడం లేదని ఆమె పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ బాలికలు ఇద్దరికి బంధుత్వంతో పాటు మంచి స్నేహం కూడా ఉంది. బాలికల మిస్సింగ్ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు వారి ఆచూకీ కోసం పట్టణంలోని సీసీ కెమెరాలు, అనుమానిత వ్యక్తి లోకేషన్ గుర్తింపుపై ఆరా తీశారు. నందికొట్కూరు పోలీసులతో పాటు కర్నూలు, డోన్ రైల్వేస్టేషన్ల పోలీసులను కూడా అప్రమత్తం చేశారు. అయితే వారి వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో వారి ఆచూకీని గుర్తించడం పోలీసులకు కష్టమైంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాలిక తల్లికి ఒకరు ఫోన్ చేసి మీ ఇంటికి కొరియర్ వచ్చిందా..అని వెంటనే ఫోన్ పెట్టేశారు. విషయాన్ని పోలీసులకు తెలియ జేయడంతో వెంటనే సీఐ రాము ఆ ఫోన్ నంబరు గల వ్యక్తికి ఫోన్ చేయగా హైదరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు మైనర్ బాలికలు తన వద్ద నుంచి ఫోన్ తీసుకుని మాట్లాడారన్న విషయాన్ని తెలిపారు. వెంటనే హైదరాబాద్‌లో నివాసం ఉండే ఆత్మకూరుకు చెందిన వ్యక్తులను అక్కడికి పంపించి ఆ బాలికల ఫొటోలను వాట్సాప్‌లో పెట్టారు. అక్కడికి వెళ్లిన వారు బస్టాండ్‌లో గాలించగా రాత్రి 11 గంటలకు ఆ ఇద్దరు బాలికలు అక్కడే ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని సీఐ రాముకు తెలియజేయడంతో ఆయన హైదరాబాద్ బస్టాండ్‌లోని పోలీసు ఔట్ పోస్టుకు సమాచారం ఇచ్చారు. అఫ్జల్‌గంజ్ పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే ఆత్మకూరు పోలీసులు, బాలికల కుటుంబీకులు హైదరాబాద్‌కు వెళ్లి వారిని ఆత్మకూరుకు తీసుకొచ్చారు. కాగా పారిపోయేందుకు ప్రయత్నించిన ఆ ఇద్దరు బాలికలు బస్టాండ్ నుంచి వెళ్తే పోలీసులు గుర్తిస్తారన్న అనుమానంతో ఆటోలో కరివేన వరకు వెళ్లి అక్కడి నుంచి కర్నూలుకు, కర్నూలు నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా తల్లి మందలించినందుకే వారు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మంత్రాలయం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహల్లి సమీపంలో ఆగి వున్న బొలేరోను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు భక్తులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మంగళ వారం జరిగింది. ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాల మేరకు బొలేరో గొర్రెలను ఎక్కించుకుని మాధవరం నుంచి ఎమ్మిగనూరు వెళ్తుండగా.. టెంపోను రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. రాంపురం చెందిన ఆటో డ్రైవర్ నాగలదిన్నె అయ్యప్ప అనే వ్యక్తి బెంగళూరు రామనాథహల్లికి చెందిన వేణుగోపాల్, రాధ, షాలిని, సహదేవలను ఎక్కించుకుని మంత్రాలయం వస్తూ ఆగి ఉన్న బొలేరోను ఢీకొట్టాడు. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

క్యాన్సర్ హాస్పిటల్‌కు సక్సన్ ఆపరేటర్లు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం రూ.50వేల విలువ చేసే రెండు సక్సన్ ఆపరేటర్లను విరాళంగా అందించారు. మంగళవారం క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్, ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మకు కేఎంసీ అల్యూమి అధ్యక్షుడు డా.కుమార స్వామిరెడ్డి, సెక్రటరీ డా.జి.బాలమద్దయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డా.కేజీ గోవిందరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.సాయిప్రదీప్, సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, అల్యూమి నాయకులు డా.రామచంద్రరావు, డా.వై.ప్రవీణ్ కుమార్, క్యాన్సర్ వైద్యులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ..

- 10 తులాల బంగారం, 10తులాల వెండి, రూ.10వేల అపహరణ

కొలిమిగుండ్ల, అక్టోబరు 7 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని మదనంతపురం గ్రామంలో పట్ట పగలే భారీ చోరీ జరిగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన అంబటి జనార్థనరెడ్డి గ్రామ చివరన కలాల కాలనీలో కొత్త ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అయితే మంగళవారం ఉదయం 8గంటల సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి పొలం పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి చేరుకోగా, ఇంటి తాళం పగులగొట్టి, డోర్లు తెరిచి ఉండటంతో ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు అర్థమైందని జనార్ధనరెడ్డి తెలిపారు. బీరువా తాళాలు అక్కడే పెట్టి ఉండటంతో, దొంగలు బీరువాను తెరిచి, అందులోని 10 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. 3తులాలు నల్ల పూసల దండ, 6జతల కమ్మలు, 6ఉంగరాలు, ఒకటి సాదా చైన్‌తో పాటు, 10తులాల వెండి, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12లక్షలు పైబడి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మదనంతపురంలో ధ్వంసమైన బీరువా

కోసిగిలో 6 తులాల బంగారు, కేజీ వెండి, రూ.లక్ష నగదు మాయం

కోసిగి: ఉరుకుంద రోడ్డు సాయిబాబా నగర్‌లో మంగళవారం చోరీ జరిగింది. సాయిబాబా నగర్‌లో నివాసముంటున్న లీలావతి, మధు సోమవారం ఇంటికి తాళం వేసి కౌతాళానికి వెళ్లారు. దీంతో అదే రోజు అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోని బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారం, కేజీ వెండి, లక్ష నగదును దోచుకెళ్లినట్లు బాధితులు కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. అలాగే ఇంటికి ఉన్న సీసీ ఫుటేజీలో దొంగతనం చేస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. కాగా కోసిగిలో గత కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు మండల ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. గత శనివారం వందగల్లు గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ పీర్ మహ్మద్ ఇంట్లో దొంగలు చొరబడి 4 తులాల బంగారం, రూ.5వేల నగదు దోచుకెళ్లారు. రెండురోజుల వ్యవధిలోనే సాయిబాబా నగర్‌లో భారీ దొంగతనం జరగడం చర్చనీయాంశమైంది. రాత్రివేళలో పోలీసులు గస్తీ లేకపోవడంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఎస్ఐ హనుమంతరెడ్డిని వివరణ కోరగా.. కేసు నమోదు చేసి దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేస్తామన్నారు.

ముంచిన టమోటా

- ఓర్వకల్లు మండలంలో పంటకు తెగులు
- తగ్గిన దిగుబడి.. పడిపోయిన ధర

ఆదుకుంటుందనుకున్న టమోటా రైతును ముంచింది. అధిక వర్షాలతో పంటకు తెగులు సోకింది. దీనితోపాటు మార్కెట్‌లో ధర పతనం కావడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లెలో తెగులు సోకిన టమోటా పంట

ఓర్వకల్లు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె, కొమరోలు, చెన్నంచెట్టిపల్లి తదితర గ్రామాల్లో 200 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. మొదట్లో పంట బాగా వచ్చినా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వైరస్ (కుళ్లు తెగుళ్లు) సోకింది. దీంతో కాయలు కుళ్లి, వాటిపై మచ్చలు వచ్చాయి. దీంతో వీటిని మార్కెట్‌లో విక్రయిస్తే ధర రాదని రైతులు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎకరాకు రూ.50వేల పెట్టుబడి

టమోటా సాగుకు ఎకరాకు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టామని రైతులు అంటున్నారు. తెగులు సోకడంతో తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. పెట్టుబడి కూడా రాలేదని అప్పుల పాలయ్యామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

తగ్గిన దిగుబడి, ధర పతనం

గతేడాది ఎకరాకు 800 బాక్సుల దిగుబడి వచ్చింది. అయితే ఈ ఏడాది అధిక వర్షంతో 500 బాక్సులు కూడా రావడం లేదు. దీనికి తోడు మార్కెట్‌లో ధర భారీగా పడిపోయింది. గతంలో బాక్సు(సుమారు 25కేజీలు) ధర రూ.700ల నుంచి రూ.800ల వరకు పలికేది. ప్రస్తుతం రూ.150ల వరకు మాత్రమే పలుకుతుండటంతో ఏమిచేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

తీవ్రంగా నష్టపోయా



నాలుగు ఎకరాల్లో టమోటా సాగు చేశాను. అధిక వర్షాలకు తెగులు సోకి కాయలు కుళ్లిపోతున్నాయి. రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. ఇప్పటికి కేవలం రూ.70వేలు మాత్రమే వచ్చింది. దాదాపు రూ.1.30లక్షలు నష్టపోయా.

- కాకి దేవేంద్ర, రైతు, సోమయాజులపల్లె

వైరస్‌తో తీవ్ర నష్టం



ఐదెకరాల్లో టమోటా సాగు చేశాను. వైరస్ తెగులుతో రైతులం తీవ్రంగా నష్టపోయాం. ఏ రోజూ ఇలాంటి తెగులు చూడలేదు. పెట్టుబడి కూడా దక్కక అప్పుల వలయంలో కూరుకుపోయాం.

- రామ మద్దిలేటి, రైతు.

బెస్తల అన్నదాన సత్రానికి స్థలం కేటాయించండి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో బెస్త నిత్యాన్నదాన సత్రానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు పీటి సాయి ప్రదీప్ కోరారు. మంగళవారం శ్రీశైలం ట్రస్టు బోర్డు చైర్మన్ రమేష్‌నాయుడుకు వినతి పత్రం అందజేశారు. మాజీ చైర్మన్ జి.చంద్రమౌళి, వెంకటేశ్, రమేష్, మనోహర్, భాస్కర్ పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

నేడు మండల సమావేశం

సి. బెళగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాణెమ్మ తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ ఎంపీపీ బొంతల మున్నె అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి పాల్గొంటారన్నారు. అధికారులు సర్పంచులు, ఎంపిటీసీలు హాజరుకావాలని కోరారు.

రేపు కాన్షీరామ్ వర్ధంతి

కర్నూలు రూరల్ అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు కాన్షీరామ్ 19వ వర్ధంతి గురువారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు ఆకెపోగు వనుములయ్య తెలిపారు. కర్నూలు అంబేడ్కర్ భవన్‌లో ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు.

ప్రజారోగ్య అధికారిగా విష్ణుమూర్తి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారిగా డా.ఎస్.బి. విష్ణుమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకుంటానన్నారు. కమిషనర్ పి.విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన డా.ఎస్‌బి.విష్ణుమూర్తి 2002 నుంచి 2007 వరకు కర్నూలు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. అనంతపురం సంచార్ చికిత్స నోడల్ అధికారిగా పని చేస్తున్న ఆయనను నగర పాలక ప్రజారోగ్య అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



కురువల అభివృద్ధికి సహకరించాలి



మంత్రి సవితను కలిసిన కురువ సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కురువల అభివృద్ధికి సహకరించాలని మంత్రి సవితను ఆ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కర్నూలులో మంత్రిని సన్మానించారు. గొర్రెలు, మేకలకు ఉచిత బీమా, 90 శాతం సబ్సిడీపై గొర్రెలు, మేకల కొనుగోలు చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. తిరుపతి, అహోబిళం, విజయవాడ, పట్టణాల్లో భక్తకనకదాసు భవనం నిర్మించాలని కోరారు. స్పందించిన మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. గుడిసె శివన్న, ఎంకే రంగస్వామి, శ్రీలీలమ్మ, పెద్దపాడు ధనుంజయ, తౌడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీజేపై దాడిచేసిన వారిని శిక్షించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ బీఆర్.గవాయిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద డీవైఎఫ్ఐ ఉపాధ్యక్షుడు హుస్సేన్ బాషాఎస్ అధ్యక్షతన నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, సాయి ఉదయ్ మాట్లాడుతూ ఈ రోజు దేశమే తలదించుకునేలా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై సనాతన ధర్మం పేరుతో షూ విసరడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనడానికి ఇదే నిదర్శమన్నారు. నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మతాల మధ్య చిచ్చుపెట్టే వారిని ప్రజస్వామ్యవాదులు, అభ్యదయవాదులు, లౌకికవాదులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అబ్దుల్లా, అంజి, ఆర్యన్ సాయి, యువరాజ్, సందీప్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదిని శిక్షించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు

కర్నూలు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేసిన మతోన్మాదిని శిక్షించాలని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యుడు ఎం.సుధాకర్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ న్యాయ చరిత్రలో ఇలాంటి సంఘటన దురదృష్టకరమని, దాడిని కాంగ్రెస్ పార్టీ తరఫున ఖండిస్తున్నామన్నాడు. ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగ, బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, రేపల్లె ప్రతాప్, సయ్యద్ ఖాద్రీ బాషా, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయాలి

సి. బెళగల్, అక్టోబరు 7 ఆంధ్రజ్యోతి): తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయాలని ఎంపీడీవో రాణెమ్మ సూచించారు. మంగళవారం బురాన్‌దొడ్డి, బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బ్యాథోలి గ్రామాల్లోని పథకాలను పరిశీలించారు. అనుమతి లేని కొళాయిలను తొలగించాలని, ఇంటిపన్ను వసూలుచేయాలని కార్యదర్శులను ఆదేశించారు. డీప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి ఉన్నారు.

జీవో 143, 32ను రద్దు చేయాలి



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జీవోలు 143, 32ను వెంటనే రద్దు చేయాలని ఏపీ తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడలో వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్‌గౌర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏఎన్ఎం రీడిప్లాయ్‌మెంట్‌ను రద్దు చేయాలని, జీఎన్ఎం కోర్సు పూర్తిచేసిన వారికి స్టాఫ్ నర్సులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. సీహెచ్‌వోలను పీహెచ్‌వోలుగా మార్పు చేయాలని, మహిళా ఉద్యోగులకు రద్దు చేసిన అడిషినల్ హెచ్ఆర్ఏ, 2211 కింద పని చేస్తున్న వారికి ఎఫ్‌టీఏ చెల్లించాలని కోరారు. స్పందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సభ్యులు మక్బుల్ సాహెబ్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ఓర్వకల్లు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్.షాజహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం నన్నూరు పీహెచ్‌సీ వద్ద నిరసన తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వం బడా కార్పొరేట్‌కు ఊడిగం చేస్తున్నాయని ఆరోపిచంఆరు. ఆశా వర్కర్ల సంక్షేమాన్ని పట్టించుకోకుండా వదిలేశారన్నారు. ఇప్పటికైనా సెలవులు మంజూరుచేసి మొబైల్ సిమ్ కార్డులు ఇవ్వాలని, దహన సంస్కారాలకు రూ.20వేలు ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలన్నారు. శాంతమ్మ, సరోజ, సుశీల, పార్వతి, సుజాత, రేణుక పాల్గొన్నారు.



నన్నూరులో నిరసన తెలుపుతున్న ఆశా వర్కర్లు

ఘనంగా వాల్మీకి జయంతి

- కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల్లో నాయకులు, అధికారుల నివాళి



జడ్పీలో నివాళి అర్పించిన సీఈవో నాసరరెడ్డి, అధికారులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంచుకోవాలని నగర పాలక మేనేజర్ చిన్నరాముడు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పించారు. రామాయణాన్ని రచించి, మానవజాతికి ఉన్నతమైన ఆదర్శాలను, నైతిక విలువలను బోధించారన్నారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్, ఆర్ఓ స్వర్ణలత, సూపరింటెండెంట్లు సుబ్బన్న, మంజూర్‌భాష, రామక్రిష్ణ, డీఎస్‌వో కృష్ణమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● జడ్పీ మినీ సమావేశ భవనంలో సీఈవో జి.నాసరరెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోడుమూరు ఎంపీడీవో రాముడు, అధికారులు సి.రాంగోపాల్, నాగేంద్రప్రసాద్, పుల్లయ్య, బాబు భాస్కర్ పాల్గొన్నారు.

కర్నూలు రూరల్: నగరంలోని ధర్నాచౌక్ వద్ద వాల్మీకి విగ్రహానికి కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి మంగళవారం నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయణాన్ని రాసిన వాల్మీకి మహర్షి అని కొనియాడారు.

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, హుశేనాపురం, పూడిచెర్ల, లొద్దిపల్లె గ్రామాలతో, పాఠశాలలో మంగళవారం వాల్మీకి జయంతి నిర్వహించారు. హుశేనాపురం, నన్నూరు గ్రామాల్లో చిత్రపటాన్ని ఊరేగించారు.

కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగస్వామి నివాళి అర్పించారు. విద్యార్థులు నైతిక, ఆధ్యాత్మిక విలువలు నేర్చుకోవాలన్నారు. అధ్యాపకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, మల్లికార్జున, విజయశేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

సి. బెళగల్: మండల కేంద్రంతో పాటు పోలకల్, బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, కంబందహాల్, ముడుమాల, కొత్తకోట, ఈర్లదిన్నె, కొండాపురం, గుండ్రేవుల, చింతమానుపల్లె, తిమ్మనదొడ్డి, సంగాల, ఇనగండ్ల గ్రామాల్లో నివాళి అర్పించారు. మండల పరిషత్ కార్యాలయాలు, పంచాయతీకార్యాలయాలలో అధికారులు పూలామాలలు వేశారు. ఎంపీడీవో రాణెమ్మ, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, నాయకులు బాలాజీవెంకటేశ్, బుర్రావెంకటేశ్వర్లు, కోడుమూరు తెలుగు యువత అధ్యక్షుడు హరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి



కోడుమూరు: నివాళి అర్పించిన టీడీపీ నాయకులు

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి గ్రామంలో వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పించారు. పులకుర్తి మహర్షి ఆలయంలో అభిషేకాలు, పుష్పార్చన చేశారు. అనుగొండలో పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

కోడుమూరు: పట్టణంలోని పెద్ద బోయగేరిలోని వాల్మీకి విగ్రహానికి నాయకులు నివాళి అర్పించారు. వైసీపీ సమన్వయకర్త కోట్లహర్షవర్ధన్‌రెడ్డి, వైసీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, టీడీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి మాల మహానాడు మునిస్వామి తదితరులు వేరువేరుగా నివాళి అర్పించారు.

గూడూరు: పట్టణంలోని వాల్మీకి ఆలయంలో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు చేసి, సాయంత్రం ఊరేగించారు.కొండిగేరి, సింగనగేరి, బోయ వీధి, మూలగేరి, కురుకుందవీధి, తూర్పు, పడమర బీసీ కాలనీ, చనుగొండ్ల, మునగాల, ఆర్.కానాపురం గ్రామాల్లో నివాళి అర్పించారు.

మేలికరం మొక్కజొన్నతో అధిక దిగుబడి

- దిన్నెదేవరపాడులో పర్యటించిన శాస్త్రవేత్తలు




మొక్కజొన్న కంకులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కర్నూలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలో సరైన సీడ్‌తో పాటు మెలకువలు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు వెల్లడించారు. మంగళవారం కల్లూరు మండలం దిన్నెదేవరపాడులో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని ఆచార్య ఎన్జీరంగా, ధార్వాడ వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, రీసెర్చ్ విద్యార్థుల బృందం పర్యటించింది. మొక్కజొన్న రైతులతో మాట్లాడి జర్మినేషన్, మెట్టపొలాల్లో మొక్కజొన్న హైబ్రీడ్ సంపూర్ణ పరిశోధన, సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ 110 రోజుల్లో ఎకరా సాగులో 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడిని ఇచ్చే మొక్కజొన్న వంగడాలను సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. మార్కెట్‌లో ఇందుకు సంబంధించిన విత్తనాలను చూసి కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి రొనాల్డ్ రిగన్, లేపాక్షి సీడ్స్ కంపెనీ ఎండీ మడితాటి సురేష్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సి. బెళగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండడలంలోని కొత్తకోట గ్రామంలో తెలుగుయువత అధ్యక్షుడు హరి సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆటో యూనియన్ నాయకులతో కలిసి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. పంచాయతీ కార్యదర్శి బేగ్, శ్రీనివాసులు తిమ్మప్ప, బాషా ఉన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జీఎస్టీ తగ్గింపును వినియోగించుకోవాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వస్తుసేవల పన్ను తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని కార్మిక సహాయ కమిషనర్ సాంబశివ కోరారు. మంగళవారం రైల్వే స్టేషన్ సమపీంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై కార్మికులకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్, వన్ టాక్స్ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. అధికారులు హేమాద్రి, సమీర్, నీలిమ సంధ్య, రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత పాల్గొన్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కార్మికుల పనిగంటలు పెంపును ఉపసంహరించుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌వద్ద సీఐటీయూ, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక 2019లో మూడు, 2022లో ఒకటి మొత్తం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి, గతంలో ఉండే 29 కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. అయితే కేరళ ప్రభుత్వం కోడ్‌లను అమలు చేయడము లేదన్నారు. నాయకులు ఎండి.అంజిబాబు, కేవి.నారాయణ, నాగన్నా, విజయ్, ఆంజనేయులు, నరసింహులు, అబ్దుల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

విధులను బహిష్కరించిన న్యాయవాదులు

కర్నూలు లీగల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడికి నిరసనగా మంగళవారం న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత ప్రధాన న్యాయమూర్తిపైనే న్యాయవాదే దాడి చేయడం తీవ్రమైన విషయమని, ఇది ప్రజాస్వామ్యంపైనే దాడి అన్నారు. ప్రజాస్వామ్యవాదులందరూ ఈ దాడిని ఖండించాలని పిలుపునిచ్చారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కర్నూలు క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కళ్యాణ్ అనే యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. బంధువుల వివరాల మేరకు.. కళ్యాణ్ ఓ ప్రైవేటు సంస్థలో కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నాడు. సొంతూరు కల్లూరు మండలం లక్ష్మీపురం కాగా, దేవనగర్‌లో నివాసముంటున్నాడు. కళ్యాణ్ కొద్ది కాలంగా సమీప బంధువైన ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. రెండేళ్ల క్రితం వీరిద్దరు చాటుగా పెళ్లిచేసుకోగా.. యువతి బంధువులు అంగీకరించక, యువకుడిని బెదిరించారు. మనస్థాపం చెందిన కళ్యాణ్ మంగళవారం విషద్రావణం తాగాడు. బంధువులు పెద్దాసుపత్రికి తరలించారు. మూడో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మృతి

కర్నూలు క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామాంజనేయులు (27) అనే యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఉల్లిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపిన మేరకు.. కర్నూలుకు చెందిన రామాంజనేయులు రేమడూరులో స్థిరపడ్డారు. సి.క్యాంపులో ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా రేమడూరు గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పి గాయపడ్డాడు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు క్రీడాకారుల ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 బుధవారం స్విమ్మింగ్ మోడర్న్ పెంటాతలన్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి టి.కృష్ణ తెలిపారు. కర్నూలు కిసాన్‌ఘాట్ డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఈత ఎంపిక ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9441402325 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యాంధ్ర సాధనకు కృషి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తానని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాక కమిషనర్ వీర పాండియన్ అన్నారు. మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ డా.మహేశ్వరరెడ్డి మంగళవారం కమిషనర్‌ను కలిశారు. కొవిడ్ సమయంలో కమిషనర్ అందించిన సహకారానికి మెడికవర్ హాస్పిటల్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో కమిషనర్ వీరపాండియన్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని సెంటర్ హెడ్ డా.మహేశ్వరరెడ్డి, పేర్కొన్నారు. నాణ్యమైన క్రిటికల్ కేర్, ప్రభుత్వ ప్రైవేటు రంగాల మధ్య సమన్వయం, ఆరోగ్యకర అభివృద్ధిపై ఇరువురు చర్చించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సీడీపీవో

బాల్య వివాహాలు నేరం

కోడుమూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం నేరమని సీడీపీవో వరలక్ష్మీదేవి అన్నారు. మంగళవారం కేజీబీవీలో 'బేటీ బచావో.. బేటీ పడావో' నిర్వహించారు. అమ్మాయి, అబ్బాయి లకు నిర్దీత వయసు వచ్చాకే వివాహాలు చేయాలని చట్టం చెబుతోందన్నారు. బాలికలు సమతుల్య ఆహారం తీసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, మల్లీశ్వరి, జరీనా, పద్మ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి రాజ్యాంగంపైనే దాడి



ధర్నా చేస్తున్న సీఐటీయూ, కేవీపీఎస్ నాయకులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు జడ్జిపై దాడి, రాజ్యాంగంపైప దాడి అని కేవీపీఎస్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎండి ఆనంద్‌బాబు, ఎండీ అంజిబాబు విమర్శించారు. మంగళవారం కేవీపీఎస్, సీఐటీయూ ఆధ్వర్యంలో భారత ప్రధాన న్యాయమూర్తిపై దాడికి నిరసనగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రోజురోజుకూ దేశంలో మతం పేరుతో ఉన్మాదం పెరిగిపోతుందన్నారు. దళితులు ఏ స్థాయిలో ఉన్నా దాడులు, దౌర్జన్యాలు చేస్తామనడానికి సంకేతమన్నారు. ఈ దాడిపై దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలు ఐక్యంగా ఉద్యమించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ నగర కార్యదర్శి ఎం.భాస్కర్, సీఐటీయూ కార్యదర్శులు ఎం.విజయ్, ఆర్.నరసింహులు, నగేష్, అబ్దుల్ దేశాయ్, ఏసురాజు, రమణ, సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఊరట

కల్లూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట లబించిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్‌ఏపీ క్యాంప్ కళ్యాణమండపంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రదర్శనలో ప్రజలకు అవగాహన కల్పించారు. డీఎస్పీ మహబూబ్‌భాషా, వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ నీరజ, కె.పార్వతమ్మ, ఎస్కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి కృషి

వయోవృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ సంఘం చైర్‌పర్సన్, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆ శాఖ సహాయ సంచాలకులు ఫాతిమా అధ్యక్షతన ఏ.క్యాంపు ఉద్యానభవన్ హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సివిల్ న్యాయాధికారి బి.లీలావెంకట శేషాద్రితో పాటు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రూ.4 వేల పింఛన్, అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, చేతి కర్రలు ఇస్తుందన్నారు. అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

మహర్షి వాల్మీకి ఆదర్శప్రాయుడు



మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్‌నాయుడు

ఆలూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి బోయ వర్గానికి ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే విరుపాక్షి, ఎమ్మెల్సీ మధుసూదన్‌నాయుడు అన్నారు. మంగళవారం ఆలూరులో మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేశారు. కూటమి ప్రభుత్వం వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలోకి మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, నాయకులు భాస్కర్, అరికెర వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, గుర్రం హరి, వరుణ్, తిక్కస్వామి, మల్లికార్జున, సోమశేఖర్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఎస్టీ రిజర్వేషన్ సాధ్యం



ఆలూరులో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడితోనే వాల్మీకి, బోయలకు ఎస్టీ రిజర్వేషన్ సాధ్యమవుతుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక బస్టాండు వద్ద విగ్రహానికి పూలమాలలు వేశారు. వాల్మీకి వర్గానికి టీడీపీలో పెద్దపీట వేస్తున్నారన్నారు. మహర్షి వాల్మీకిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లప్ప, టీడీపీ నాయకులు రామ్‌భీమ్‌నాయుడు, చంద్రశేఖర్, బసప్ప, నరసప్ప, ముద్దురంగ, నెట్టప్ప, కొమ్ము రామాంజనేయులు, మసాల జగన్, కృష్ణయాదవ్, శీనప్ప, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గర్భిణీ, పసి పిల్లలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలకు జీతాలు పెంచేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్‌కు అంగన్‌వాడీలు మంగళవారం వినతి పత్రం అందించారు. స్థానిక సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్ర, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు చిట్టెమ్మ, పద్మలు కలిసి ఎమ్మెల్యేకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని, మా పని భారాన్ని దృష్టిలో పెట్టుకుని జీతాలు పెంచాలన్నారు. 4జీ సేవల వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, పనికి తగ్గ వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు లక్ష్మీదేవి, రామాంజినమ్మ, సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు



పాల్గొన్న టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ, నాయకులు



వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న పి.కోటకొండ గ్రామస్థులు

ఆదోని, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని కల్లుబాయి ప్రాంతంలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా దివ్యమైన శోభతో వెలిగిపోయింది. మహర్షి పట్ల ప్రజల్లో ఉన్న అపారమైన భక్తిని, గౌరవాన్ని చాటుతూ ఈ వేడుకలను అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించారు. ఈ మహత్తర పూజా కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ ప్రత్యేకంగా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించి, తమ ఆధ్యాత్మిక నిబద్ధతను చాటుకున్నారు. వారి చేతులమీదుగా జరిగిన ఈ పూజలు భక్తులకు కన్నుల పండువగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో వాల్మీకి పెద్దలు, ప్రముఖ నాయకులు గుడిఎ ।రాములు, మురళి, కల్లుబావి మల్లికార్జున, సీపీఐ రాజు, సాదిక్ వల్లి, భరత్, విజయ్ పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. గ్రామగ్రామాన వాల్మీకి విగ్రహాలకు, చిత్రపటాలకు పూజలు చేసి వాల్మీకి మహర్షి గొప్పతనాని వివరించారు. రామాయణ విశిష్టత వాల్మీకి మహర్షితోనే వెలుగులోకి వచ్చిందన్నారు.జ్ఞానసుధ, సరస్వతి పాఠశాలలో వాల్మీకి మహర్షిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

మద్దికెర : మండలంలోని మద్దికెర, తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం వాల్మీకి జయంతి కావడంతో మండలంలోని మద్దికెర, మదనంతపురం, ఎడవలి గ్రామాల్లో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటాన్ని గ్రామ పురవీదుల గూండా ఊరేగింపు చేశారు.

వెల్దుర్తి:
వెల్దుర్తిలో వాల్మీకి జయంతి వేడుకలు వాల్మీకి సేవాసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు గోపీనాథ్ నాయుడు ఆధ్వర్యంలో పాతబస్టాండ్‌లో ఉన్న వాల్మీకి విగ్రహానికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోయపాటి శ్రీను, రామచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: వాల్మీకి జయంతి ఉత్సవాలను మండలంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండలంలోని తుగ్గలి,జొన్నగిరి, పగిడిరాయి తదితర గ్రామాల్లో వాల్మీకి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రామాయణ పఠనం చేశారు. ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వల్లె వెంకటేశ్, దామోదర్, నక్కల రమేష్, పంచాయతీ సలహాదారుడు హనుమంతు, బీవీఎస్ నాయకులు వీవీ నాయుడు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి



మంత్రి సవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు

తుగ్గలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు కోరారు. మంగళవారం కర్నూలులో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి బీసీ సమస్యలను పరిష్కరించాలని వినతి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుగ్గలి మండలంలో బీసీలు ఎక్కువగా ఉన్నారనీ, వెనుకబడి ఉన్న ప్రాంతం అని, వర్షాధార పంటలుపండక పట్టణాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తున్నారనీ, తల్లిదండ్రులు పట్టణాలకు వెళితే.. హాస్టల్ వసతులు లేక పిల్లలు కూడా వారి వెంట వెళ్లి బడులకు దూరమవుతున్నారు. బీసీ సంక్షేమ హాస్టల్ మంజూరు చేస్తే పేద విద్యార్థులకు విద్యను అందించిన వారవుతారన్నారు. ఈయన వెంట టీడీపీ నాయకులు బత్తిన కిరణ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు జిల్లా బెస్ట్ స్వచ్ఛ అవార్డు



టీజీ భరత్ చేతుల మీదుగా జిల్లా స్వచ్ఛ ఆంధ్ర పాఠశాల అవార్డును అందుకుంటున్న హెచ్‌ఎం ఫయాజుద్దీన్

ఆదోని అగ్రికల్చర్, అక్టోబర్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లా స్వర్ణాంధ్ర బెస్ట్ స్వచ్ఛ ఉన్నత పాఠశాలగా ఆదోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేసింది. సోమవారం రాత్రి కర్నూల్ సునయన ఆడిటోరియంలో జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ జాయింట్ కలెక్టర్ నవ్య చేతుల మీదుగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు పాఠశాలలు మాత్రమే బెస్ట్ స్వర్ణాంధ్ర స్వచ్ఛ అవార్డులకు ఎంపికయ్యాయని అందులో తమ పాఠశాల ఉండడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. పాఠశాల ఆవరణ. తరగతి గదులు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంతో తమ పాఠశాలను జిల్లా సెలక్షన్ బృందం ఎంపిక చేసిందన్నారు. పాఠశాలకు అవార్డు రావడం పట్ల ఉపాధ్యాయులు సునీల్‌రాజ్ కుమార్, రమేష్ నాయుడు, నాగరాజు, రాజా సతీష్, మల్లికార్జున, జగన్మోహన్ హెచ్‌ఎంను అభినందించారు.

హోసూరులో విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ

పత్తికొండ టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హోసూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు గ్రామస్తులు క్రీడా దుస్తులను మంగళవారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం నరేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 35 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులను గ్రామస్తులు అందజేశారు. ఈ సందర్భంగా దుస్తులను విరాళంగా అందజేసిన దాతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు రాహుల్‌యాదవ్, జయరాము డు, సాయినాథ్‌రెడ్డి, వీఆర్వో భార్గవ్, ఆంజనేయులు, పీడీ విజయన ందారావు పాల్గొన్నారు.

బస్సులు వెల్దుర్తిలోకి రావాలి

వెల్దుర్తి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): డోన్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ గ్రామప్రజలు డోన్ ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెల్దుర్తికి బస్సు స్టాప్ ఉన్నా ఊరిలోకి రాకుండా జాతీయరహదారి పై బస్సులు వెళుతుండడంతో ఉచిత బస్సు సౌకర్యం అందడం లేదని పేర్కొన్నారు. కేవలం ఆర్డినరీ, సూపర్ లగ్జరీ బస్సులు మాత్రమే ఊర్లోకి వస్తున్నాయని వెల్లడించారు. రాత్రి వేళల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణీకులను జాతీయరహదారి పై దింపివేయడంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు.

సీజేఐపై దాడి చేసిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుడిసె మహానంది

ఆస్పరి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సీజేఐ జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గుడిసె మహానంది డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రమైన ఆస్పరిలోని మార్కెట్‌లో విలేకరులతో మాట్లాడారు. సాక్షాత్తు భారత ప్రధాన న్యాయమూర్తి సిజేఐపై ఓ మతోన్మాది దాడి చేయడం బాధాకరమన్నారు. వెంటనే సదరు నిందితుడిని అరెస్టు చేసి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మతోన్మాదం రోజురోజుకు పెరిగిపోతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు తెవుల తిప్పన్న, పరశురాముడు, వీరేష్, వెంకటరాముడు, చాగి సాయి, దాసరి అజయ్, రంగనాయకులు, మహానంది పాల్గొన్నారు

పత్తికొండ టౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి అమానుషమని, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధు డిమాండ్ చేశారు. మంగళవారం సుప్రీంకోర్టు జడ్జిపై జరిగిన దుశ్చర్యను ఖండిస్తూ న్యాయవాదులు నిరసన తెలియజేశారు. అనంతరం జడ్జి జ్యోష్ణదేవికి వినతి పత్రం అందించారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

న్యాయవ్యవస్థపై మతపరమైన దాడులు జరగడం ప్రమాదకరమని, దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేంద్రకుమార్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మతం పేరుతో దేశ న్యాయవ్యవస్థపైన దాడులు చేయడం నేరమన్నారు. ఇలాంటివి పునరావృత్తం గాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీహెచ్‌పీఎస్ నాయకులు గురుదాస్, రామాంజనేయులు, రంగన్నలు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోటాపోటీగా ఎద్దుల రాతిదూలం పోటీలు

తుగ్గలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన రాతిదూలం పోటీలు పోటాపోటీగా నిర్వహించారు. మంగళవారం మండల పరిధిలోని జొన్నగిరిలో నిర్వహించిన రాతిదూలం పోటీలకు 14 జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నాయి. ఈ పోటీలో పాల్గొన్న వృషభాలకు మొదటి, రెండోవ, మూడో బహుమతులు రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, ప్రజలు వాల్మీకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే గర్భస్థ శిశువుకు ఆరోగ్యం

ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



చిన్నారితో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

పత్తికొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహారంతోనే గర్భస్థశిశువు ఆరోగ్యంగా ఎదుగుదసాధ్యమవుతుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు , ఐసిడిఎస్ పిడి విజయలు అన్నారు. పత్తికొండ ఐసిడిఎస్ ప్రాజెక్టుపరిదికి సంబంధించి సిడిపితో లలిత ఆధ్వర్యంలో పత్తికొండ ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణలో 8వ రాష్ట్రీయపోషన మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేఈ మాట్లాడుతూ గర్భందాల్చిననాటినుండి మహిళలకు ప్రభుత్వం ఐసిడిఎస్ ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తూ గర్భస్థశిశువు ఆరోగ్యపరిరక్షణకు కృషిచేస్తుందన్నారు. కాన్పుతర్వాత చిన్నారులకు ఐదేళ్లు వచ్చేవరకు పోషక ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇందుకోసం మహిలళవివరాలు సేకరించడంతోపాటు వారికి నెలనెల పౌష్టికాహారాన్ని క్రమంతప్పకుండా అందించేందుకు పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఆయన అబినందనలు తెలిపారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణిలకు శ్రీమంతం కార్యక్రమాలలో ఆయన పాలుపంచుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, బిటిగోవిందు, కడవలసుధాకర్, పుండుకూరబ్రహ్మయ్య, క్రాంతిరవి, ఐసీడిఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న అధికారులు

మద్దికెర అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థిని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని తహసీల్దార్ గూండాల్ నాయక్, ఎస్‌ఐ విజయకుమార్, ఎంఈవో రంగస్వామి, బండారు తిమ్మయ్య సేవా సంస్థ నిర్వహకులు బండారు చిత్తరంజన్‌దాస్ అన్నారు. మంగళవారం 2024-25 పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు స్థానిక గౌరయ్యస్వామి అన్నపూర్ణ, అతివర్ణ ఆశ్రమంలో స్వర్గీయ బండారు తిమ్మయ్య జయంతిని పురస్కరించుకుని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని షాలినికి రూ.25వేలు, ప్రవీణ రూ.20వేలు, సుప్రియ రూ.15వేలు, శివరాం రూ.10వేలు, చిన్నరాజు రూ.5వేల నగదును అధికారుల చేతుల మీదుగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పారా రాఘవేంద్ర అధ్యక్షతన అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జ్యోతిరెడ్డి, సవిత, దేవేంద్రప్ప, బండారు చిత్తరంజన్‌దాస్ పాల్గొన్నారు.

సొంత ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

దేవనకొండ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీలు సొంత ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో జ్యోతి సుచించారు. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో మండలంలోని సర్పంచులు, పంచాయతి కార్యదర్శులతలో జరిగిన సమావేశంలలో అమె మాట్లాడుతూ .గ్రామంలో తడి, పొడి చెత్త సేకరించి ఆదాయాని మెరుగు పరుచుకోవాలని, ఇంటి పన్నుల వసూలలో నిర్లక్ష్యం వీడి నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకొవాని సొంత ఆదాయ మార్గాలను పెంపొదించుకోవాలన్నారు.

ఫిర్యాదుతో సంబంధం లేదు

కర్నూలు క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో నకిలీ పట్టా సృష్టించి, రూ.10లక్షలు తీసుకున్న కేసుతో తనకు సంబంధం లేదని ఆదోని పద్మశాలి సేవా సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చిలక రాజశేఖర్ అలియాస్ శేఖర్ అన్నారు. మంగళవారం మాట్లాడుతూ కుమ్మరి విజయలక్ష్మి, రాముడు, ఏజెంట్ చిలక రాజశేఖర్‌పై కర్నూలు ఎ.క్యాంపుకు చెందిన ప్రవీణ్‌కుమార్ అనే వ్యక్తి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు ఇచ్చారన్నారు. అయితే కర్నూలులో కూడా నా పేరు కలిగిన వ్యక్తి ఇంకొకరు ఉండవచ్చన్నారు. కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా తప్పుడు ప్రచారం ఆపకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

నేడు టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం బుధవారం ఆలూరు పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి తెలిపారు. మంగళవారం ఇందుకోసం ఏర్పాట్లను పరిశీలించారు. సమావేశానికి టీడీపీ జోనల్-5 ఇన్‌చార్జి ఎంఎల్‌సీ బీద రవిచంద్రయాదవ్, జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు, సీనియర్ నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు.

పదోన్నతులు కల్పించే వరకు పోరాటం



గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

గోనెగండ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యులకు పదోన్నతులు కల్పించే వరకు పోరాటం చేస్తామని సీహెచ్‌వో మేరి గోల్డ్, ఎంపీహెచ్‌వో హనుమంతు, సుధాకర్ అన్నారు. మంగళవారం గోనెగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యులకు మద్దత్తుగా సీహెచ్‌వో, ఎంపీహెచ్‌వో, ఎంపీహెచ్‌సీ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు లక్ష్మీకాంతమ్మ, శాంతమ్మ, పీహెచ్‌ఎన్ భారతి విజయలక్ష్మి, ఎంపీహెచ్‌సీ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి


ఆర్‌ఐ జర్మియాకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

పెద్దకడబూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏఐకేఎస్, సీపీఐ నాయకులు వీరేష్, రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ జర్మియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ మండలంలో నెల రోజులుగ కురుస్తున్న భారీ వర్షాలకు పంటపొలాలన్ని నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నాయకులు నాగేష్, గోపాల్, గంగన్న, నరసింహులు, నాగేంద్ర, రామాంజి పాల్గొన్నారు.

ఘనంగా గురు జగన్నాథ దాసర పూర్వారాధన


పీఠాధిపతికి శ్రీకృష్ణుడి విగ్రహాన్ని అందజేస్తున్న అప్పన్న ఆచార్

మంత్రాలయం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళంలో వెలసిన గురు జగన్నాథ దాసర పూర్వారాదన ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ముఖ్యఅతిథిగా హాజరైన మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు పంచరథాలపై గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దాదాపు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన జగన్నాథ దాసర మ్యూజియాన్ని ప్రారంభించారు. అక్కడే మూల రాములకు సంస్థాన పూజ చేసి భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో దేశాయ్ మాధవరావు, వాధిరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాషాచార్, పూజారి వ్యాసరాజాచార్, గోపాల కృష్ణస్వామి, భక్తులు పాల్గొన్నారు.

మఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతం

మంత్రాలయం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో సామూహిక సత్యనారాయణ వ్రతం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో నిర్వహించారు. మంగళవారం అశ్వయుజ పౌర్ణమి శుభదినాన్ని పురస్కరించుకొని ప్రవచన మంటపంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం చేసి పసుపు,గందం, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. భక్తులకు పీఠాధిపతి తీర్థప్ర సాదాలను అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..

కోసిగి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు రోడ్డులో శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం వద్ద కౌతాళం మండలం కరిణి గ్రామానికి చెందిన దళిత హుసేనీ 90 ఎంఎల్ 480 మద్యం ప్యాకెట్లను బైక్‌పై తరలిస్తుండగా.. రాబడిన సమాచారం మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి, సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితుడి నుంచి 5 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని, బైక్‌ను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


పట్టుబడిన మద్యాన్ని చూపిస్తున్న సీఐ భార్గవ్ రెడ్డి

ఆకాశాన్ని అంటుతున్న గ్రాసం ధరలు


ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న వరి గ్రాసం

గోనెగండ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది గ్రాసం ధర చుక్కలు చూపుతుంది. ఆదోని డివిజన్‌లో గ్రాసం వచ్చే పంటలు ఎక్కువగా సాగుచేయక పోవడం, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రాసం దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, మండలాల్లో ఎక్కువగా వర్షాలు కురియడం, చేతికి అందిన గ్రాసం నల్లగా మారిపోవడం దీనికి తోడు ఈ మండలాలలో పత్తి, మిరప, పంటలు సాగు చేశారు. దీంతో గ్రాసం కొరత ఏర్పడింది. చాలామంది రైతులు గ్రాసం కొరత కారణంగా పశువులను కబేళాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది వరి, వేరుశనగ, పంటలను రైతులు ఎక్కువగా సాగుచేయక పోవడం చేసిన చోట గ్రాసం నల్లబడటంతో వాటి ధర విపరీతంగా పెరిగింది. ట్రాక్టర్ గ్రాసం రూ.15వేల నుంచి 18 వేల వరకు పలుకుతుంది.


ఎమ్మిగనూరు: టీడీపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు


ఎమ్మిగనూరులో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న బుట్టా రేణుక, వాల్మీకులు


బీజేపీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు


నందరంలో వాల్మీకి విగ్రహం ఊరేగింపు

ఘనంగా వాల్మీకి జయంతి

● నివాళి అర్పించిన నాయకులు
● గ్రామాల్లో ఊరేగింపు

ఎమ్మిగనూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యా యలంలో మంగళవారం వాల్మీకి జయంతిని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహర్షి వాల్మీకి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు మచాని మహేష్, నాయకులు వాల్మీకి రామకృష్ణ నాయుడు, బచ్చాల రంగన్న, వినయ్, వీరేష్, గిడ్డయ్య, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, జగదీష్, జయన్న, నరసింహులు, రవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: ఎమ్మిగనూరులో వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మం గళవారం వైసీపీ పార్టీ కార్యాలయం నుంచి వాల్మీకులతో ర్యాలీగా బయలుదేరి స్థానిక ట్యాంక్ బండ్ రోడ్డులో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో సినియర్ నాయకులు శివ నీలకంఠప్ప, మురారి రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్, కోటకొండ నరసింహులు, మూగితి విరుపాక్షిరెడ్డి,లతా రెడ్డి పాల్గొన్నారు.

● పట్టణంలో వాల్మీకి విగ్రహానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గడ్డం నారాయణ రెడ్డి, బుట్టా రంగయ్య, బీమరెడ్డి పాల్గొన్నారు.

● పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు ఆత్మనిర్భార్ ఎమ్మిగనూరు, మంత్రాయలం ఇంచార్జి గురురాజ్ దేశాయ్, జిల్లా కార్యదర్శి దయాసాగర్‌లు మాట్లాడుతూ రామాయణం సృష్టికర్త వాల్మీకి మహర్షి తను రచించిన కావ్యం వలన ఎందరో జీవితాలు మారాయని అన్నారు. కార్యక్రమంలో చరణ్, వీరేష్, శివ పాల్గొన్నారు.

నందవరం: మండలంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నందవరంలో ఏపీ బీసీ కో- అపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ రాముడు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పెద్దరాముడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు లచ్చప్ప నాయుడు, నాయకులు బీమశేఖర్‌తో పాటు, ముగతి, మాచాపురం, సోమలగూడురులలో మాజీ సర్పంచ్ రాముడు, మిట్టా సోమాపురం వీరేష్, ఉరుకుంద, లింగన్న, నాగలదిన్నె తిమ్మప్ప ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు జరుపుకున్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం వాల్మీకి విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్రఐక్య వాల్మీకి పోరాటకమిటీ రాష్ట్ర అధ్యక్షులు బీ.లక్ష్మన్నలు వేర్వేరు సమయాల్లో పూలమాలలు వేసి పూజలు చేశారు. అదేవిధంగా మాలపల్లి, రచ్చుమర్రి, చెట్నహళ్లి, చిలకలడోణ, సూగూ రు, బసాపురం గ్రామాల్లో వాల్మీకి నాయకులు వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో గుర్రెడ్డి భీమిరెడ్డి, సివి విశ్వనాథ్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, తెల్లబండ్ల భీమయ్య, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర, పవన్‌రెడ్డి, గోపాల్, నక్కి వెంకటేష్, రోగప్ప, మజ్జిగ బొజ్జప్ప, దుళ్లయ్య, డీసీ తిమ్మప్ప, హనుమంతు పాల్గొన్నారు.


మంత్రాలయంలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

కోసిగి: కోసిగిలోని వాల్మీకి సర్కిల్‌లో ఉన్న వాల్మీకి విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ నాయకులు రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి, నాడిగేని అయ్యన్న, చింతలగేని నర్సారెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, భరద్వాజ శెట్టి, మహదేవ, అలాగే వైసీపీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ కుమార్ రెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి మురళీ మోహన్ రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడిగేని నాగరాజు, బీజేపీ రాముడు వేర్వేరుగా వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. వాల్మీకులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి నాయకులు వక్రాణి వెంకటేశ్, హోళగుంద కోసిగయ్య, ముకుంద కిష్టప్ప, పంపాపతి, గాంధీనగర్ శ్రీన, ఎంపీటీసీ రాజు, నరసింహులు, మారెప్ప, మాలపల్లి వెంకటేశ్, కోసిగయ్య పాల్గొన్నారు.


పెద్దకడబూరులో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దకడబూరు/ఎమ్మిగనూరు రూరల్: పెద్దకడబూరు మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే వాల్మీకి విగ్రహం దగ్గర ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నరసన్న, అంజి, మీసేవా నరసప్ప, వీరేష్‌గౌడ్, శివ లు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గోనెగండ్ల ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి వాల్మీకి దేవాలయం వరకు వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. దేవాలయం దగ్గర వాల్మీకి విగ్రహనికి క్షీరాభిషేకం చేశారు. టీడీపీ మండల కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, టీడీపీ మాజీ టౌన్ ప్రెసిడెంట్ రమేష్‌నాయుడు, ఉరుకుందు, ఎల్ఐసీ రంగస్వామి, శ్రీధర్, రంగస్వామి, మేకలమునెప్ప, మాజీ సర్పంచ్ రంగముని, రంగన్ననాయుడు, రామయ్య, గోవిందు, రామకృష్ణ, వెంకటేష్, పుట్టపాశంలో బీటీ బడేసాబ్, బీటీ శ్రీనివాసులు, బీటీ విజయ్, బీటీ గణేష్ బీటీ రాజశేఖర్ పాల్గొన్నారు.

పెద్దనేలటూరులో ర్యాలీ...

మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. రాత్రి స్థానిక చెన్నకేశవస్వామి దేవాలయం నుంచి వాల్మీకి దేవాలయం వరకు వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. దేవాలయం దగ్గర వాల్మీకి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జిల్లా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దనేలటూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు సోమన్న, శేషప్ప, వెంకట్రాముడు, వెంకటేష్, గోపాల్, సాయి, రఘు, ఓబిలేషు పాల్గొన్నారు.



కోసిగిలో వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు, వాల్మీకులు


పెద్దనేలటూరులో వాల్మీకి సంఘం నాయకు ర్యాలీ

జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు లబ్ధి

ఎమ్మిగనూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 వల్ల ప్రజలకు చాలా వస్తువుల మీద రేట్లు తగ్గాయని, దీంతో వినియోగదారులకు ఖర్చులు తగ్గి లబ్ధి పొందుతారని ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ బాషా తెలిపారు. మంగళవారం కళాశాలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జీఎస్టీలో ఐదు రేట్లు ఉండేవని, ప్రస్తుతం మూడు రకాల రేట్లు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు జీఎస్టీ గురించి అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం జీఎస్టీ పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ సూశీలమ్మ, అధ్యాపకులు రాజశేఖర్, క్రాంతికుమార్, పాల్ దేవదానం, బలరాముడు, తిప్పెస్వామి, అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్ఎంఎల్ డిగ్రీ కళాశాలలో జీఎస్టీ తగ్గింపు పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు


నందవరంలో శిక్షణ కల్పిస్తున్న అదనపు ఎంపీడీవో

నందవరం మండల కేంద్రంలో..

నందవరం: జీఎస్టీపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అదనపు ఎంపీడీవో సందీప్ తెలిపారు. మండల కేంద్రమైన నందవరం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇన్‌చార్జు ఎంపీడీవో కృష్ణమూర్తి ఆద్వర్యంలో మొదటి రోజు శిక్షణ తరగతులు ప్రారంబమైయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓన్ స్కోర్ రెవిన్యూ కార్యక్రమంపై అధికారులకు అవగాహన కల్పించారు. అలాగే జీఎస్టీ ద్వారా ప్రజలపై పడిన భారం వారు మికి మిగులు బాటు గురించి కూడా గ్రామాల్లో వివరించాలన్నారు. కార్యక్రమంకు వివిధ శాఖల అధికారులు వచ్చారు.

ఆదాయ వనరులను పెంచాలి

గోనెగండ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామాల పంచాయతీల ద్వార గ్రామాల అభివృద్ధికి ఆదాయ వనరులను పెంచుకోవాలని అందుకు పంచాయతీ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. మంగళవారం ఎంపీడీవో సమావేశ భవనం నందు గ్రామ పంచాయతీ స్వంత వనరులను సమకూర్చుకోవటం ఎలా అనే అంశం పై గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శు లకు రెండు రోజుల పాటు అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి మహర్షి, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మణిమంజరి

టీటీడీ ధార్మిక కార్యక్రమాలు


మాట్లాడుతున్న డాక్టర్ మల్లు వెంకట్‌రెడ్డి

నందవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సోమలగూడురులో టీటీడీ ధార్మిక కార్యక్రమాలు మొదలయ్యాయి. సోమల గూడురులో గ్రామంలో వెలసిన లక్ష్మనరసింహ స్వామి దేవాలయంలో ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం టీటీడీ హిందూ ధర్మ ప్రజాపరిషత్ కార్యనిర్వహకులు మల్లు వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. గ్రామపెద్దలు రుక్మాంగారెడ్డి, ఆనందరెడ్డి, సర్పంచ్ గోవిందు, శ్రీనివాసులు, లక్ష్మన్న, రామచంద్ర, రాలింగప్ప, తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం


మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నందవరం నాయకులు

నందవరం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని మంగళవారం నందవరం వైసీపీ నాయకులు కలిశారు. వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా చెన్న కేశవరెడ్డిని అధిష్టానం నియమించడంతో నందవరం నాయకులు గడ్డం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. నందవరం మాజీ జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, శాంతిరాజు, జాన్, శంకరప్ప, శవాల శాంతిరాజు, దేవదర్శనం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'న్యాయవాదిని శిక్షించాలి'

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుప్రీం కోర్టు సి.జె.ఐ బి ఆర్ గవాయ్‌పై దాడి చేసిన మనువాద న్యాయవాది కిషోర్ రాకేష్‌ను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ నాయకులు సప్పోగు తిమ్మన్న, సుమాల అంతోని, రాజా రమేష్‌లు డిమాండ్ చేశారు. సీజేఐపై చెప్పుతో దాడి చేయడం అంటే సనాతన పేరుతో నాగరికతను ధ్వంసం చేసే చర్యగా ఉందన్నారు. రాముడు, దాసు, బాబు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటకం


పౌరాణిక నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మంత్రాలయం, అక్టోబరు 7(ఆంధ్రజ్యో తి): రాఘవేంద్రస్వామి సన్నిధానంలో మంత్రాల యం మహిమ అనే పౌరా ణిక నాటకం భక్తులను ఆకట్టుకుంది. మంగళవా రం రాత్రి యోగీంద్ర కళామండపంలో తమిళ నాడుకు చెందిన శ్రీరాఘవేంద్ర సమరాధనే ఆధ్వర్యంలో దాదాపు 60 మంది పౌరాణిక కళాకారులచే నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మహిమ తెలుగు, తమిళ భాషల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తామని కృష్ణమూర్తి, కళ్యాణ్ రామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, అనంతపురాణిక్, జేపీ స్వామి, డీఎం ఆనందరావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు నివాళి

మంత్రాలయం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈడిగ అంపయ్య కుమారుడు ఈడిగ గురురాజు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు పన్నగ వెంకటేష్ మృతదేహనికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గనెకంటి గురురాజు, వట్టెప్ప నరసింహ, చిన్నభీమా, సున్నం రఘు, వట్టెప్ప సుంకప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న పన్నగ వెంకటేష్

రైతులకు పరిహారం అందించాలి


కోసిగి తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

కోసిగి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ మంగళవారం రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ పరుశురామ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పూజారి శ్రీనివాసులు, వీరేష్, రాముడు, వెంకటేష్, పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలకు విరాళం


నగదు అందజేస్తున్న వైసీపీ మండల అధ్యక్షుడు గురెడ్డి భీమిరెడ్డి

మంత్రాలయం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలడోన గ్రామంలో కేజీబీవీ బాలికల పాఠశాలకు వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి రూ.20వేల నగదును అందజేశారు. మంగళవారం పాఠశాలను సందర్శించి పాఠశాలకు అవసరమైన మైక్ సెట్ కోసం నగదును అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జనార్దన్ రెడ్డి, వీకేసీ రాఘ వేంద్ర, ఉపాధ్యాయులు గౌతమి, బ్రమరాంబ, రామకృష్ణవేణి, పాల్గొన్నారు.